


రసాయన శాస్త్రం తరగతి జోరుగా సాగుతోంది. రసాయన చర్యల కారకాలు, కారణాలను విశ్లేషించి చెబుతున్నాడు అధ్యాపకుడు.


ఇంతలో ప్యూన్ వచ్చి ఒక లేఖ అందించాడు. సర్క్యులర్స్ చదివి వినిపించడం ఆనవాయితీ కాబట్టి ఉత్తరం విప్పి గబగబా చదివాడు.

"సోంబాబు పేరున్న ఇంటర్ సెకండియర్ విద్యార్థి ఈ కాలేజీలో చదువుతున్న ఓ అమ్మాయికి ప్రేమలేఖ రాశాడు. దాన్ని ఆమెకు తరగతి గదిలో అందిస్తూ పట్టుబడ్డాడు. ఇటువంటి తప్పుచేసిన సోంబాబుకి 50 రూపాయలు జరిమానా విధించడమైనది. ఇలాంటి తప్పు మరోసారి చేస్తే తీవ్ర చర్య తీసుకోబడుతుంది". రసాయన శాస్త్రం పాఠంలోని సమీకరణాలని వివరిస్తున్న లెక్చరర్ పాఠాన్ని మధ్యలో ఆపి చదివాడు.

ఈ సర్క్యులర్‌లోని విషయం క్లాసులో ఉన్న వంద పైగా విద్యార్థినీ విద్యార్థులు ఒక్కసారి ఎటెన్షన్లోకి వచ్చేలా చేసింది. అందరి చూపులు మధ్యవరసలో మూడో బెంచిలో ముగ్గురి మధ్యన ఉన్న సోంబాబు మీద పడ్డాయి. సోంబాబు లేచి నిలబడ్డాడు. ఎటెండెన్స్ తీసుకుంటున్నపుడు లెక్చరర్లు పిలిచే

# ప్రేమ లేఖ నేర్పిన పాఠం

– కలశపూడి శ్రీనివాసరావు



సెవెంటీసిక్సుకి ఎస్సార్ అనే గొంతు ఈ సోంబాబుదేనని క్లాసులో చాలామందికి ఇపుడే తెలిసింది.

"సోంబాబు..." అంటున్న లెక్చరర్ మాట పూర్తిఅవ్వక ముందే సోంబాబు భళ్ళుమని పగిలిన మట్టికుండలోని నీళ్ళు చేసే శబ్దంలా ఏడుపు మొదలుపెట్టాడు. "ఆపు ఆపు..." అని లెక్చరర్ అంటున్నా స్టాపులో ఆగని ఆర్టీసీ బస్సులా వింత వింత శబ్దంతో సోంబాబు ఏడుపు సాగుతూనే ఉంది.

మా కాలేజీలో విద్యార్థులు ఎవరు ఏ తప్పుచేసినా మా ప్రిన్సిపాల్ విచారణ చేసి, జరిమానా విధించి ఆ విషయాన్ని ఓ సర్క్యులర్‌గా వ్రాసి, క్లాసు క్లాసుకి పంపి, బహిరంగంగా చదివించి, తప్పుచేసిన విద్యార్థికి సిగ్గు వచ్చేలా చేస్తారు. తప్పుచేసినవారు మరోసారి తప్పుచేయకుండా ఇతరులు అలాంటి తప్పు ఇక ముందు చేయకూడదని దాని ఉద్దేశ్యం. వారంలో ఒకటో రెండో ఇలాంటి సర్క్యులర్‌లు రావడం మామూలే. సాధారణంగా క్లాసులో అల్లరిచేసారనో, లెక్చరర్లని ఏడిపించారనో, కాలేజి రూల్సు పాటించలేదనో, కాయలు, పళ్ళు కోసారనో అభియోగాలు ఉండేవి. అవి సామాన్యమైనవే కాని పెద్ద తప్పులు కాదు. ప్రేమలేఖల లాంటి సమస్యలు ఎపుడో కాని బయటకు రాలేదు. పైగా ఆ తప్పు చేసినవాడు మా క్లాసులోవాడు. మనం ఉండే వీధిలోనే రాత్రి దొంగతనం జరిగిందన్న వార్త తెల్లారి న్యూస్‌పేపర్లో చదివిన లాంటి ఆశ్చర్యం. విద్యార్థుల్లో ఈ సోంబాబు ప్రేమ లేఖ వార్త కల్లోలం లేపింది.

ఇన్నాళ్ళు కలిసి చదువుకొంటున్నా సోంబాబు అన్న వాడు ఆ క్లాసులో ఉన్నట్లు చాలామందికి తెలీదు. లెక్చరర్లు అతనిని పెద్దగా పట్టించుకోలేదు. అతనికి స్నేహితులు కూడా తక్కువే. ఎవరితోనైనా కలిసి కబుర్లు చెప్పగా ఎవ్వరూ చూడలేదు. టైముకి క్లాసుకు వస్తాడు. బెల్లు కొట్టగానే బయటకు వెళతాడు. ఎప్పుడూ ఒకే తీరుగా నడుస్తాడు. ఒకే దారిలో వెళతాడు. పైగా తల వొంచుకునే వెళతాడు. ఎవరైనా తగులుతారేమోనని కుంచించుకు మరీ నడుస్తాడు. అబ్బాయిలతోనే స్నేహం లేనివాడు అసలు అమ్మాయిలవైపు కన్నెత్తి చూస్తాడా అన్నది సందేహమే! పీలగా, సన్నగా, నల్లగా, పొట్టిగా ఉండే సోంబాబుని యవ్వనంలోకి అడుగుపెడుతున్న కాలేజి స్టూడెంట్‌గా, ఓ యువకుడిగా ఎవ్వరూ గుర్తించలేదు. పొరపాటున కూడా "సోంబాబు ప్రేమలేఖ రాయడమేమిటి?"అందరిలో వచ్చిన అనుమానం. "వీడికి కూడా ప్రేమా...దోమా? అని విస్తుపోయారు అమ్మాయిలు. అబ్బాయిలు కూడా అలాగే అనుకున్నారు. ఏదిఏమైనా ప్రేమలేఖ రాశాడు. దాన్ని అందించాడు. ఆపై దొరికాడు. ప్రిన్సిపాల్ ఫైన్ వేసారు కాబట్టి నిజంగానే రాసాడన్నమాట. అందరూ అలాగే అనుకొన్నారు. నేనూ అలానే అనుకొన్నాను. ముక్కుమీద వేలేసుకున్నాను కూడా. కాని వీడికింత ధైర్యం ఎలా వచ్చిందో మాకెవ్వరికి అర్థంకాలేదు. ప్రేమలేఖ రాద్దామా వద్దా అన్న ఊగిసలాటలో ఉన్న కలాలకి ఒక్కసారి భయం వేసింది.

నిశ్శబ్దంగా ఉన్నా క్లాసుని తనవైపు ఎలా తిప్పుకోవాలో తెలియని లెక్చరర్ అవస్థపడుతున్నాడు. 'సైలెన్స్...'అని డస్టర్‌తో టేబుల్ మీద పదే పదే కొట్టారు. పిల్లకాలువలా పారుతున్న సోంబాబు ఏడుపు ఆపి "నా దగ్గర ఏభై రూపాయలు లేవు సార్..." అంటూ వెక్కిళ్ళు తీసాడు.

ఇంక ఇవాళిటికి పాఠం చెప్పడం జరగదని నిశ్చయించుకున్న లెక్చరర్ "అతని సంగతేంటో నువ్వు చూడవోయ్..." అని పరిస్థితి కంట్రోల్‌లో లేదని తెలిసిన తరువాత కిందవాళ్ళని కంట్రోల్ చెయ్యమని చెప్పి వెళ్ళిపోయిన పెద్ద పోలీసాఫీసర్లా ఠీవిగా. కొత్త బూట్లు టకటకలాడించుకొంటూ వెళ్ళిపోయాడు.

క్లాసు లీడర్ అయిన పాపానికి సోంబాబు ఏడుపు ఆపే పని నాపై పడింది.

కాసేపాగి "సోంబాబూ! ఏడుపాపి ఇంతకీ ఏం జరిగిందో చెప్పు" అన్నాను.

"నా దగ్గర డబ్బులేవు. మా అయ్య దగ్గరా లేవు... ఏభై రూపాయలంటే మాటలా..." వణికిపోతున్నాడు మళ్ళీ ఏడుపు. ఆపాటికే మరికొంత మంది అబ్బాయిలు గుమికూడారు. అందరిలో కుతూహలం కనుపిస్తున్నది. వీడు అమ్మాయికి లవ్ లెటర్ ఇచ్చాడు అన్నది అందరినీ ఇంకా ఆశ్చర్యపరుస్తూనే ఉంది.

నిజంగా జరిగిందేమిటో తెలుసుకోవాలని అనిపించింది.

"నువ్వే ఉత్తరం ఆ అమ్మాయికి ఇచ్చావా?" అడిగాడొకడు.

"ఇచ్చాను"అన్నాడు సోంబాబు.

"అమ్మ సోంబాబూ..." అన్నారు విన్నవాళ్ళంతా.

"నిజంగా ఇచ్చాడు. నిజంగా ఇచ్చాడు...అని క్లాసంతా ఒకరికొకళ్ళు చెప్పుకుని ఆశ్చర్యపోతున్నారు. కాని నాకు ఎందుకో నమ్మకం కలగడంలేదు. వాళ్ళమధ్యలోంచి ఏడుస్తున్న సోంబాబు చెయ్యి పట్టుకుని బయటకు తీసుకెళ్ళాను. ఓ చెట్టు క్రింద కూర్చోబెట్టి అతన్ని సముదాయించే ప్రయత్నం చేశాను.

"నిజంగా నువ్వు ప్రేమలేఖ రాసావా?" నేను కొంచెం ఆశ్చర్యం కలిసిన అపనమ్మకంతో అడిగాను.

"రాయలేదు."

"మరైతే ఇచ్చానంటున్నావ్. ఓవైపు రాయలేదంటున్నావ్."

"నేను రాయలేదు. కాని ఇచ్చాను..." బెక్కుతూ అన్నాడు సోంబాబు.

"నువ్వు రాయలేదు. కాని ఇచ్చావు. మరి ఈ ఉత్తరం నీకెవరిచ్చారు?"

"అతనెవరో తెలీదు."

"తెలీకుండా ఎలా వచ్చింది నీ దగ్గరికి?"

"మొన్న ఒకరోజు బస్‌స్టాపు మీంచి కాలేజికొస్తున్నాను. ఒకాయన బస్‌లోంచి పిలిచి ఈ కాలేజిలోనే చదువుతున్నావా అన్నాడు. 'అవును' అన్నాను ఓ ఉత్తరం ఇచ్చి "మీ కాలేజిలో ఉన్న బైపీసీ ఇంటర్ ఫైనల్లో ఉన్న సరోజినికి ఇమ్మ"ని కోరాడు. అది తెచ్చి ఆ అమ్మాయికి ఇచ్చాను. అంతే."

"అంతేనా అయితే నువ్వు నీ చేత్తో ఏ ప్రేమలేఖ రాయలేదన్నమాట."

"అవును."

"మరి ప్రిన్సిపాల్ గారితో చెప్పావా?"

"చెప్పాను...కాని నన్ను ప్రిన్సిపాల్‌గారి దగ్గరికి తీసుకెళ్ళిన లెక్చరర్‌గారు" నన్ను పూర్తిగా చెప్పనివ్వలేదు.

"నిజంగా నువ్వు ప్రేమలేఖ రాయలేదు కదూ" మరోసారి రెట్టించి అడిగాడు.

"నిజంగా రాయలేదు. సరస్వతి తోడు..." అన్నాడు అప్పుడప్పుడు వస్తున్న వెక్కిళ్ళ మధ్య.

ధైర్యంగా నిజాన్ని ఢంకా కొట్టినట్టు వాదించైనా ఎదుటివారిని నొప్పించాలని డిబేటింగ్ సొసైటీలో ప్రిన్సిపాల్‌గారు అంటూ ఉండేమాట నాకు బాగా నాటింది. సోంబాబుని వెంటపెట్టుకొని ప్రిన్సిపాల్ ఆఫీసుకి వెళ్లాను.

"ప్రిన్సిపాల్‌గారూ... ఇతను..."

"సోంబాబు, ఇంటర్ సెకండియర్ నాకు తెలుసు. ఇతను తప్పుచేసాడు. చేసినట్లు ఒప్పుకున్నాడు కూడా. సోంబాబుని పట్టించిన లెక్చరర్ చెప్పాడు. అందుకే ఫైన్ వేసాను. పూర్ బాయిస్ ఫండ్‌కి 50రూపాయలు కట్టమన్నాను. ఇలాంటి వెధవ పనులు చెయ్యొద్దు మళ్ళీ..." ఇంతకీ ఎందుకు తీసుకొచ్చానీతణ్ణి?

"ఇతను ప్రేమలేఖ రాయలేదండీ..." స్పష్టమైన స్వరంతో అన్నాను.

"అబద్ధాలాడితే ఫైను పెంచి సస్పెండ్ చేస్తాను" అన్నాడు ప్రిన్సిపాల్.

"నేను చెప్పేది వినండి. ఈ విషయం మీ దృష్టికి తీసుకురాక తప్పదు మరి. ఇతను మొన్న బస్టాపునుండి వస్తుంటే ఎవరో బస్‌లోంచి ఒక ఉత్తరం ఇచ్చి మన కాలేజిలో ఇంటర్ ఫైనల్ బైపీసీ చదువుతున్న సరోజినికి ఇమ్మన్నాడు. పోనీలే అని ఇతను తీసుకొచ్చి ఇచ్చాడు. అంతే! ఇతను ఏ తప్పుచెయ్యలేదు" అని నేను గట్టిగా, నిర్భయంగా తొణుకుబెణుకు లేకుండా చెప్పాను.

ప్రిన్సిపాల్ నిశ్శబ్దంగా కొద్దిసేపు మా ఇద్దరివైపు చూసారు. ఆలోచించారు. ఆ తరువాత తలపంకించారు. టేబుల్‌పైనున్న బెల్ మెల్లిగా కొట్టారు. ఫ్యూను ఆదరాబాదరగా వచ్చాడు. లెక్చరర్ రామనాథంని తీసుకొని రమ్మన్నారు.

కాసేపటికి ఆ లెక్చరర్ వచ్చారు.

"అటు మొన్న మీరు పాఠం చెప్తుండగా ఈ కుర్రాడు మీ క్లాసులో అమ్మాయికి..."

"అవును సార్! లవ్ లెటర్ ఇచ్చాడు. నేను స్వయంగా పట్టుకొన్నాను..." అంటూ గర్వంగా చెప్పాడు. ఆయన్ని ఆపుతూ.

మీరు "జరిగింది జరిగినట్లు చెప్పండి" అన్నారు ప్రిన్సిపాల్ ఓ జడ్జిలా.

"నేను పాఠం బాగా చెప్తున్నానండి. ఇంతలో ఈ కుర్రాడు" అని సోంబాబుని చూపించి సరోజినిగారు కావాలండి అన్నాడండి. సరోజిని అన్నానండి. ఓ అమ్మాయి లేచి నిలబడిందండి. ఈ కుర్రాడు నీకు తెలుసా అని ఆ అమ్మాయిని అడిగానండి. తెలీదు అందండి. నువ్వెవరని ఈ అబ్బాయిని అడిగానండి. అంతే జేబులోంచి లవ్ లెటర్ తీసి అమ్మాయి వైపు విసిరి పారిపోబోయాడండి. నేను కారిడార్‌లోకి పరిగెట్టి పట్టుకోండి పట్టుకోండి అని గట్టిగా అరిచానండి. మన ఫ్యూన్ సోములు వీడిని పట్టుకొన్నాడు. ఆ తరువాత నేను మీదగ్గరికి తీసుకొచ్చానండి.

"మీరు ఆ ఉత్తరం చదివారా?"

"లేదండి. పెళ్లైన అమ్మాయికి ప్రేమలేఖ రాయడమేంటండి? అందుకే బాధపడుతుందని ఆ అమ్మాయికి కూడా ఇవ్వలేదండి."

ఒక్క నిమిషం ఆగి- ఇస్తే ఎంత బాధ పడేదో. ఇంట్లోకూడా గొడవయ్యేది కదండీ!

సోంబాబు తప్పులేదని నాకు తెలిసినా ఆ విషయాన్ని క్లాస్మేట్స్‌కి చెప్పలేకపోతున్నాను. అల్లరి పిల్లలు సోంబాబుని ఆట పట్టిస్తున్నారు. చాటుమాటుగా గేలి చేస్తున్నారు. ఆడ పిల్లలు అతడినో నేరస్తుడిలా చూస్తున్నారు. అతని వైపు చూడ్డమే తప్పన్నట్లు ప్రవర్తిస్తున్నారు.

"ఆ ఉత్తరం నీ దగ్గరే ఉందా?"

"ఆఁ! "ఉందండి. పరీక్ష పేపర్ల కవర్లో వేసుకుంటాను.." అని వెతికి తెస్తానుండండి. ఒక్క క్షణం ఆగి గబగబా వెళ్ళిపోయాడు. ఐదు నిమిషాల్లో తిరిగి వచ్చి అంటించిన కవర్‌ని ప్రిన్సిపాల్‌కి అందించాడు. ఆ తరువాత ప్రిన్సిపాల్‌గారు దాన్ని తీసి చదివారు.

అమ్మాయిని పిలిపించమన్నారు. ఆ అమ్మాయి వచ్చింది.

"నీకు పెళ్లైందా?" అని అడిగారు ప్రిన్సిపల్‌గారు.

"అయ్యింది సార్"

"మీ ఆయన ఎక్కడున్నారు."

"పొరుగూరిలో సార్."

"ఈ ఉత్తరం చూసి చెప్పు. మీ ఆయన ఇలాగే రాస్తాడా?"అని ఆ ఉత్తరం ఆ అమ్మాయికి అందించారు.

ఆ అమ్మాయి ముసిముసి నవ్వులతో చదివింది.

"ఇది మా ఆయన రాసిన ఉత్తరమే సార్." అంది బిక్కమొహం వేసుకొని జాలిగా.

"సరే మీరు వెళ్ళవచ్చు." అన్నారు ప్రిన్సిపల్‌గారు లెక్చరర్ని. తల వంచుకొని వెళ్లడానికి సిద్ధమైన నన్నూ, సోంబాబుని ఆగమని చేత్తో సైగ చేసారు. మేం ఆగాము.

"ధైర్యంగా ఈ విషయాన్ని నాకు తెలియచెప్పినందుకు నిన్ను మెచ్చుకుంటున్నా" అని నాతో అన్నాడు. "ధైర్యం అన్న మంచి లక్షణం లేకపోతే ఎన్ని సుగుణాలున్నా అవన్నీ దండగే. ధైర్యం నేర్చుకో" అని సోంబాబుతో అన్నారు.

మేం ఇద్దరం ఆయనకి కృతజ్ఞతలు అర్పిస్తూ బయటకు వచ్చాం.

అది జరిగి రెండు రోజులు గడిచాయి.

మా తరగతిలో అదివరకున్న ఉత్సాహం లేదు.

ఏదో వెలితి కనిపిస్తోంది.

సోంబాబు తప్పులేదని నాకు తెలిసినా ఆ విషయాన్ని క్లాస్మేట్స్‌కి చెప్పలేకపోతున్నాను. అల్లరి పిల్లలు సోంబాబుని ఆట పట్టిస్తున్నారు. చాటుమాటుగా గేలి చేస్తున్నారు. ఆడ పిల్లలు అతడినో నేరస్తుడిలా చూస్తున్నారు. అతని వైపు చూడ్డమే తప్పన్నట్లు ప్రవర్తిస్తున్నారు.

నా అంతరాత్మకి మాత్రం సోంబాబు తప్పులేదని తెలుసు. కాని ఎలా చెప్పాలో తెలీడం లేదు.

ఇంకా సోంబాబే తప్పుచేశాడని, శిక్ష అనుభవించాలని లేఖను పట్టిచ్చిన లెక్చరర్ ఠాంఠాం చేస్తూనే ఉన్నాడు.

ఇదంతా చూసి సోంబాబు బిక్కచచ్చాడు. అప్పటికి అది మూడో రోజు.

ఏభై రూపాయల ఫైను ఎలా కట్టాలో తెలియక క్షణ క్షణం సతమతమవడం కనిపిస్తూనే ఉంది.

మూడోరోజు రసాయన శాస్త్రం లెక్చరర్ సెవెంటీ సిక్స్! అని పిలిచినప్పుడు ఎస్సార్ అనే పలుకు వినబడలేదు.

ఒక్క క్షణం నిశ్శబ్దం తరువాత అందరూ ఆ విషయాన్ని మరిచిపోయారు.

నాకెందుకో బాగనిపించలేదు. లెక్చరర్ రసాయనాల కలయికకి తీసుకునే సమయం. ఆ సమయంవల్ల వచ్చే ఫలితాల గురించి చెబుతున్నాడు. మధ్యమధ్యలో పరీక్షలకోసం ఏం చదవాలో ఎలా చదవాలో సూచనలు ఇస్తున్నాడు.

బయటనుండి ఫ్యూను సార్ అని పిలిచిన శబ్దం. పాఠం ఆపి అతను తెచ్చిన సర్క్యులర్ విప్పి చదివాడు.

ఆ విద్యార్థి ఫైన్ కట్టనవసరం లేదు. నాకు తెలియకుండా నా చేతులారా ఓ తప్పుచెయ్యని విద్యార్థికి జరిమానా విధించాను. ఆ తప్పుకుగాను ఈ కాలేజి ప్రిన్సిపాల్‌గా ఉన్న నేను 500 రూపాయలు జరిమానా విధించుకొంటున్నాను. ఈ డబ్బుని పూర్ బాయిస్ ఫండ్‌కు చెల్లించగలను. "ప్రిన్సిపాల్ పంపిన సర్క్యులర్ చదవడం మొదలుపెట్టిన లెక్చరర్ పూర్తిచేసేటప్పటికి, తన తప్పుకు తానే ఫైన్ వేసుకొన్న ప్రిన్సిపాల్‌గారి డిసిప్లిన్‌కి అందరం ఆశ్చర్యపోయాం.

ఏం చెయ్యాలో తెలియని విద్యార్థినీ విద్యార్థులంతా లేచి నిలబడ్డారు. ఒక్క సర్క్యులర్‌తో ప్రిన్సిపల్‌గారు కాలేజి అంతటికి ఒక గొప్ప పాఠం నేర్పారు అని అనిపించింది.

ఆ పాఠం ఇప్పుడు అమెరికాలో ఏ హోదాలో ఉన్న నాకు నిత్యం పఠనీయంగా అనిపిస్తుంది. అలాంటి ఒక గొప్ప పాఠం నేర్పడానికి తరగతి గదే కానక్కరలేదని తెలిసాక విద్యాలయం అంటే తరగతి గది సరిహద్దులు కాదని తెలుసుకున్నాను.

మరచిపోలేని ఈ పాఠం పది మందికి చెప్పాలని అనిపిస్తుంటుంది.

అందుకే ఆ జ్ఞాపకంతో ఇప్పుడు మీ ముందుకొచ్చాను.

నిజానికి నేను కథకుణ్ణి కాదు.

★

రచయిత చిరునామా:
కె.శ్రీనివాసరావు,
208 పార్క్‌వే డ్రైవ్,
రోసెల్‌యాన్ హైట్స్, ఎన్‌వై, 11577, యుఎస్ఎ.